మానని గాయాలు

- టీడీపీ కార్యకర్తల కవ్వింపుతో వైఎస్సార్ సీపీ మహిళానేత శివజ్యోతి ఆత్మహత్యాయత్నం
- పార్టీ కోసం పనిచేసినందుకు యువతిపై దాడి



మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ శివజ్యోతి



గాయాలపాలైన రాజ్యలక్ష్మి

కంకిపాడు: టీడీపీ విజయోత్సవాల గాయాలు మానలేదు. ఆ పార్టీ కార్యకర్తల కవ్వింపు చర్యలు, దాడితో గాయపడ్డ ఓ మహిళా నేత, ఓ మాజీ వలంటీరు చికిత్స పొందుతూనే ఉన్నారు. విజయోత్సవ ర్యాలీలతో టీడీపీ కార్యకర్తలు ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. బైక్‌లు, కార్లలో ర్యాలీలు చేస్తూ భయానక వాతావరణం సృష్టించారు. వైఎస్సార్ సీపీ నేతల ఇళ్ల ముందు ర్యాలీలు, కవ్వింపు చర్యలకు దిగి, అవమానకరంగా ప్రవర్తించారు. టీడీపీ శ్రేణుల అవమానాన్ని భరించలేక, మహిళా నాయకురాలు పాలడుగు శివజ్యోతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. ఈ నెల 4న జరిగిన ఓట్ల లెక్కింపులో పెనమలూరులో కూటమి అభ్యర్థి గెలుపుతో మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో టీడీపీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించి రచ్చ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు పాలడుగు శివజ్యోతి ఇంటి వద్దకు వెళ్లి కవ్వించారు. చిన ఓగిరాల కిలాడి లేడీ అంటూ పోస్టర్లను ప్రదర్శించి అవమానిస్తూ హేళన చేశారు. అవమానభారం భరించలేక శివజ్యోతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందిన ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉంది. మహిళ అని చూడకుండా యార్లగడ్డ సాయి, వెనిగళ్ల కుటుంబరావు, మంచిగంటి రమేష్, పాలడుగు మల్లికార్జునరావు, కంచర్ల కోటేశ్వరరావు, గుమ్మడి కల్యాణ్‌తో పాటుగా మరికొందరు అవమానకర వ్యాఖ్యలు చేస్తూ హేళన చేశారని, టీడీపీ వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఉయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నారు.

ఆలస్యంగా వెలుగులోకి దాడి ఘటన

ఇదే గ్రామంలో ఓ యువతిపై జరిగిన దాడి ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన వలంటీరు ఓగిరాల రాజ్యలక్ష్మి వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ఉన్న అభిమానంతో వలంటీరు ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రామంలో క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంది. ఆ గ్రామ మహిళా నేత శివజ్యోతిని ఆస్పత్రిలో చేర్చిన అనంతరం గ్రామానికి వచ్చిన రాజ్యలక్ష్మి ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించినందుకు టీడీపీ కార్యకర్తలు ఆమెను జుట్టుపట్టుకుని కిందపడేసి విచక్షణా రహితంగా కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. ఆ గాయంతో ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో ఉయ్యూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొనసాగుతున్న కవ్వింపు చర్యలు

టీడీపీ కార్యకర్తల కవ్వింపు చర్యలు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. కాటూరులో వైఎస్సార్ సీపీ నేతను లక్ష్యంగా చేసుకుని టార్గెట్ చేశారు. గొల్లగూడెంలో పంచాయతీ భవనంపై యువగళం జెండా ఎగురవేశారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ బోర్డుపై వైఎస్సార్ పేరు తొలగించారు. పెద పులిపాక గ్రామ సచివాలయం భవనంపై నవరత్నాల బోర్డు, వైఎస్ జగన్ చిత్రపటాన్ని ధ్వంసం చేశారు. ఈ దాడులు, విధ్వంసాలతో నియోజకవర్గంలో భయానక పరిస్థితులు నెలకున్నాయి.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



వీరపనేనిగూడెంలో నీటి కుంట తవ్వకం పనుల్లో పాల్గొన్న కూలీలు

గన్నవరం రూరల్: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు శనివారం ముమ్మరంగా కొనసాగాయి. మొత్తం 104 పనులు జరగగా 4,234 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు కొనసాగుతున్నాయి. నీటి కుంటల తవ్వకంతో రైతాంగానికి మేలు జరుగుతుందని ఏపీఓ సత్యప్రియ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు దినసరి వేతనం రూ.300 అందజేస్తున్నట్లు తెలిపారు. కూలీలు మరింతగా పనుల్లో పాల్గొనాలని కోరారు. నీటి కుంటలు తవ్వకం ద్వారా వర్షపు నీరు ఆ కుంటలలో నిల్వ ఉండి భూమిలో తేమ శాతం పెరుగుతుందన్నారు. భూమికి మేలు చేసే సూక్ష్మ క్రిములు పెరిగి భూసారం పెరగటం ద్వారా పంటలు అధిక దిగుబడిని ఇస్తాయన్నారు. రైతాంగానికి ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. నీటి తడులు తగ్గుతాయని, నీటి కుంటల ప్రయోజనాలు తెలుసుకుని మరింత మంది రైతులు నీటి కుంటల తవ్వకాలకు పథకం ద్వారా ముందుకు రావాలన్నారు.

పంట కాలువలో తూటుకాడ తొలగించరూ



గొల్లపూడి కాలువలో పేరుకుపోయిన తూటుకాడ

విజయవాడరూరల్: గొల్లపూడి పంట కాలువలో పేరుకుపోయిన తూటుకాడను తొలగించాలని రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభంకానున్న నేపథ్యంలో కాలువలో దట్టంగా పెరిగి కాలువ నీరు కింది గ్రామాల్లోని పొలాలకు నీరు రావడానికి వీలుగా కాలును బాగుచేయాలని రైతులు కోరుతున్నారు. కృష్ణానది నుంచి గొల్లపూడి, భవానీపురం, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, విలేజి కండ్రిక, నున్న ముస్తాబాదు గ్రామాల్లోని వరి పంట సాగు చేసే పంట పొలాలకు నీరు వచ్చే విధంగా చూడాలని గ్రామాల్లోని రైతులు కోరుతున్నారు. గొల్లపూడి కింది గ్రామాల వరకు తూటుకాడ దట్టంగా పెరిగి ఉండడంతో నీరు సక్రమంగా పారుదల అయ్యే వీలులేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచి కాలువను అభివృద్ధి చేస్తేనే సీజను నాటికి ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న పొలాలకు ప్రధాన కాలువ, సబ్‌చానెల్ ద్వారా నీరు అందేలా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

మానవతా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవతా నూతన కార్యవర్గ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆపద్కాలంలో తోటివారికి సాయం అందించాలనే మానవతాన్ని ప్రతిఒక్కరిలోనూ పెంపొందించాలనే లక్ష్యంతో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నిస్వార్థంగా కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 2024-25 సంవత్సరానికి గానూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. స్థానిక ఏలూరురోడ్డులోని మానవతా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా విశ్రాంత అధ్యాపకుడు గూడపాటి జయరామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పాబోలు గణేష్‌బాబు, కోశాధికారిగా గంటా ఇందిరాదేవి, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, సహాయ కార్యదర్శిగా బెజవాడ శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఉడత కృష్ణమోహన్, రేవిణిశెట్టి సూర్యనారాయణ, గోళ్ల మల్లికార్జునరావు, కళ్లేపల్లి నారాయణరావు ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ముఖ్య అతిథిగా విచ్చేసిన మానవతా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పొట్లూరి శేషగిరిరావు, సీనియర్ సభ్యుడు తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎంసీ సేవల్లో యువత భాగస్వాములు కావాలి



షేక్ సైదాకు నియామక పత్రం అందజేస్తున్న నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడ రూరల్): ముస్లిం మైనార్టీలకు ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) ద్వారా అందజేస్తున్న సేవా కార్యక్రమాల్లో ముస్లిం యువత భాగస్వాములు కావాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా సూచించారు. స్థానిక 64వ డివిజన్ టింకరింగ్ షెడ్ వద్ద శనివారం ఏఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ముస్లింల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా ఆజాద్ ముస్లిం కమిటీ సేవలను అందజేస్తుందన్నారు. కమిటీలో కొత్తగా చేరే ప్రతీ ఒక్కరు, ముఖ్యంగా యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. 61వ డివిజన్ ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా షేక్ సైదాను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఏఎంసీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నున్న గ్రామంలోని పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. సమావేశంలో సెంట్రల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు అన్వర్‌బేగ్, ప్రధాన కార్యదర్శి జానీ భాష, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం భీమవరానికి చెందిన శ్రీ ఉమా సోమేశ్వర కూచిపూడి నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఏ.వైష్ణవి శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడలతో చిన్నారుల్లో శారీరక దృఢత్వం



శిక్షణ పొందిన చిన్నారులతో రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): క్రీడలతో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని విజయవాడ రైల్వే ఏడీఆర్ఎం పి.ఈ.ఎడ్విన్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకలు శనివారం రైల్వే మినీ స్టేడియంలో జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఆర్ఎం పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా చిన్న వయస్సు నుంచే పోటీతత్వం, టీం వర్క్ అలవడుతుందన్నారు. క్యాంప్‌లకు తమ పిల్లలను పంపించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. అనంతరం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ పొందిన 68 మంది పిల్లలకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర్ బి.టి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మోపెడ్ దగ్ధంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు పెట్టిన మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కోమల విలాస్ సెంటర్ సమీపంలోని గులామ్‌మొహిద్దీన్ వీధిలో నిమ్మగడ్డ నాగ వెంకటరమణ నివాసం ఉంటున్నాడు. వెంకటరమణ వస్త్రలతలో బట్టల వ్యాపారం చేస్తుంటాడు. వెంకట రమణ యాక్టివా మోపెడ్‌ను వినియోగిస్తుంటాడు. శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన వెంకట రమణ తన మోపెడ్‌ను ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. తెల్లవారుజామున వెంకట రమణ ఇంటి సమీపంలో నివాసం ఉండే సుధాకర్ ఫోన్ చేసి మోపెడ్ కాలిపోతుందని చెప్పాడు. దీంతో కిందకు వచ్చి చూసే సరికి మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

17 నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బందరురోడ్డు, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం బాధ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, ట్యాలీ కోర్సులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి కోర్సుకు 2 నెలలు శిక్షణ ఉంటుందన్నారు. అతి తక్కువ ఫీజుతో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన విద్యను గత 8 సంవత్సరాలుగా వేలాది మందికి అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, గృహిణులు, జాబ్ చేస్తున్న వారు ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా ఈ కోర్సులు నేర్చుకోవడానికి అర్హులన్నారు. ఆసక్తి కలవారు తమ కార్యాలయంలో లేదా 73821 93413, 94900 98042 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్రైజర్‌పేట జగ్గుపిల్ల రామారావు వీధిలో గిరిజాల నాగమణి, రాజేష్‌ల కుటుంబం నివాసం ఉంటోంది. వీరికి ఒక పాప సంతానం కాగా రాజేష్ బంగారం పని చేస్తుంటాడు. ఈ నెల 1వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజేష్ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన అతడి భార్య నాగమణి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో తమ్మిన తేజ దుర్గ వెంకట్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వెంకట్ బీసెంట్ రోడ్డులోని ఓ బట్టల దుకాణంలో అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 5న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పిన వెంకట్ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. బయటకు వెళ్లే సమయంలో ఫోన్‌లోని సిమ్ కార్డు తీసుకుని, ఫోన్‌ను ఇంట్లోనే వదిలేశాడు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, షాపులో వారిని ఆరా తీసినా ప్రయోజనం లేదు. దీంతో వెంకట్ సోదరుడు తాగూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాలనీలో ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బ్లాక్ నంబర్ 96లో మహాంకాళి వెంకన్న కుటుంబం నివాసం ఉంటోంది. లారీ డ్రైవర్‌గా పని చేసే వెంకన్న ఈ నెల 2న తన బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ కార్యకర్తల దాడులు చేయడం సరికాదు



పాయకాపురం(విజయవాడరూరల్): టీడీపీ కార్యకర్తలు ఇంటి అద్దాలు, కారు అద్దాలను ధ్వంసం చేయడం, కత్తులతో బెదిరించడం సరికాదని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బోను నరేష్ అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి పెద్దిరెడ్డి శివారెడ్డి ఇంటిపై టీడీపీ కార్యకర్తలు గురువారం అర్ధరాత్రి దాడి చేయగా బోను నరేష్ శనివారం పరామర్శించారు. శివారెడ్డిని పరామర్శించిన వారిలో ఎన్టీఆర్ జిల్లా కాపు సామాజికవర్గం అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్, కనుగుల బాల, పలువురు పార్టీ శ్రేణులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ఆఫీస్‌ను స్వాధీనం చేసుకునే ప్రయత్నం



వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వేసిన పెయింటింగ్



పార్టీ గుర్తులు కనిపించకుండా రంగులు వేస్తున్న పెయింటర్

గన్నవరం: రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో అద్దె ప్రాతిపదకన ఏర్పాటు చేసిన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు ఆ పార్టీకి చెందిన స్థల యాజమాని రాత్రికిరాత్రే భవనాన్ని ఖాళీ చేయించే పనిలో పడ్డారు. గత పదేళ్లుగా పార్టీ కార్యాలయంగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఈ నెల నాల్గో తేదీన ఎన్నికల ఫలితాలు అనంతరం సదరు కార్యాలయాన్ని ఖాళీ చేయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కార్యాలయంలోని సామగ్రిని తరలించేందుకు నెల రోజులు గడువు కోరినప్పటికీ సదరు యాజమాని నిరాకరించారు. రెండు రోజులుగా పార్టీ కార్యాలయంపై ఉన్న రంగులను చెరపివేసి పెయింట్లు వేయడంతో పాటు పార్టీ దిమ్మను పగులగొట్టారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఉనికి ఉండకూడదనే కుట్రలో భాగంగా ఇదంతా చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. త్వరలోనే అందరికి అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ ముఖ్య నేతలు తెలిపారు. పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అండగా నిలుస్తారని పేర్కొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం



రైల్వే హాస్పిటల్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శౌరిబాల

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరమని రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల పేర్కొన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, లక్షణాలు, చికిత్స తదితర వివరాలను వివరించారు. పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి బ్రెయిన్ ట్యూమర్ నివారణలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, ఏఓఐ హాస్పిటల్ రేడియాలజిస్ట్ డాక్టర్ సాయి స్నేహిత్, డాక్టర్ హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయండి సారూ..



జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌ల్లో రూ. 22 కోట్లతో రోడ్డు పనులు చేపట్టారు. అంతర్గత రోడ్లు సైతం పూర్తిచేశారు. మెయిన్ రోడ్డు పనులు కూడా ప్రారంభించి సగం పనులు పూర్తి చేశారు. అయితే ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిటీ బస్సు వచ్చినప్పుడు ఎదురుగా భారీ వాహనాలు వస్తే అవస్థలు పడాల్సి వస్తోందని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ వెనుక వైపునకు మార్పు చేశారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే వారు అనేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఏఎస్‌ఐ బైక్ చోరీ

పెనమలూరు: పెనమలూరులో ట్రాఫిక్ ఏఎస్‌ఐగా పని చేస్తున్న యారంశెట్టి భగవతి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు ట్రాఫిక్ ఏఎస్‌ఐగా పని చేస్తున్న భగవతి విధులు ముగించుకుని తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. గుర్తు తెలియని దొంగలు అతడి బైక్‌ను చోరీ చేశారు. ఈ ఘటన పై ఏఎస్‌ఐ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

పార్టీ పటిష్టతకు పట్టుదలతో పనిచేద్దాం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ పటిష్టతకు పట్టుదలతో పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బందెల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గ్రామ వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల శనివారం నిర్వహించారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లు, అభ్యర్థులకు వచ్చిన ఓట్ల శాతంపై సమీక్షించారు. బందెల సుబ్బారావు మాట్లాడుతూ సంయమనం, సమన్వయం పాటించాల్సిన తరుణమిదన్నారు. ఓటమి భారంతో కుంగిపోకుండా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. పార్టీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త చైతన్యం కావాలన్నారు. భేదాభిప్రాయాలను విడనాడాలన్నారు. సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌కు బాసటగా నిలవాలన్నారు. ప్రజల పక్షాన నిలబడి పనిచేయాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంగల నాగయ్య, సొసైటీ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, నాయకులు లాం సురేష్, నెరుసు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం నేడు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అధ్యాత్మిక వేదికపై సాయంత్రం ఆరు గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ తప్పక విచ్చేసి విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యుల రాజీనామా

ఉంగుటూరు: మండలంలో కేడీసీసీ బ్యాంక్‌నకు అనుసంధానంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యవసాయ సహకార సంఘాల త్రీమెన్ కమిటీ సభ్యులు శనివారం రాజీనామా చేశారు. సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సేవ చేసే అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు పలువురు త్రీమెన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తేలప్రోలులో తియ్యగూర రామిరెడ్డి, వేంపాడులో నాగనబోయిన సోమేశ్వరరావు, మానికొండలో గొగినేని వెంకటేశ్వరరావు బాబు అదేవిధంగా ఆయా గ్రామాల్లోని చైర్మన్, కమిటీ సభ్యులు రాజీనామా చేశారు.

శనీశ్వరునికి సహస్ర నీలార్క పుష్పార్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశ క్షేమం, ప్రజాక్షేమాన్ని కాంక్షిస్తూ శ్రీ శివజ్ఞాన పీఠంలో శనివారం శనీశ్వరునికి సహస్ర నీలార్క పుష్పార్చన జరిగింది. 30 రోజుల పాటు ప్రతిరోజూ ఏలిననాటి శని, అర్ధాష్టమశని, జన్మశని, శని మహర్దశ బాధ ఉపశమనం కోసం సహస్ర నీలార్క పుష్పార్చన నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శివాచార్యస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుమూర్తి శర్మ, భక్తులు పాల్గొన్నారు.